




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

| విజయవాడ VIJAYAWADA | సంపుటి : 24 | సంచిక : 135 | ది. 29-7-2025 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| | Vol.No : 24 | Issue No : 135 | Date : 29-7-2025 | Tuesday | Pages : 8 | Rs.1/- |



## ఏపీ రాజ్‌భవన్‌కు మాజీ సీఎం జగన్



**విజయవాడ,జూలై 28 (వార్తాప్రభ) :** గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను జగన్ దంపతులు సోమవారం సాయంత్రం రాజ్ భవన్ లో కలిశారు..ఇటీవల అస్వస్థతకు గురైన గవర్నర్‌ను జగన్ పరామర్శించారు. అదేవిధంగా లిక్కర్ కేసు, రాష్ట్రంలో శాంతిభద్రతలపై చర్చ జరిగినట్లు సమాచారం. ప్రభుత్వం కక్ష చర్యలకు పాల్పడుతూ అక్రమ కేసుల కింద వైసిపి నాయకులను అరెస్టు చేస్తుందని గవర్నర్ దృష్టికి జగన్ తీసుకువెళ్లారు.

# పెట్టుబడులకు ఏపీ రైట్ ఛాయిస్, సేఫ్ ప్లేస్

- పెట్టుబడులు పెట్టండి...పేదలకూ సాయం చేయండి
- ఏపీ-సింగపూర్ స్టార్టప్ ఫెస్టివల్ నిర్వహిస్తాం
- విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు రండి.
- ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరమ్ రోడ్ షోలో సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలపై సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్



**అమరావతి, జూలై 28 (వార్తాప్రభ) :** పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ఎంపిక అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆ పెట్టుబడులు కూడా అత్యంత భద్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. ఈ ఏడాది నవంబర్ లో విశాఖలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా ఏపీ- సింగపూర్ బిజినెస్ ఫోరమ్ తరపున రోడ్ షో కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సమావేశానికి సింగపూర్ కంపెనీల ప్రతినిధులతో పాటు ఏపీ నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రోడ్ షో కార్యక్రమంలో ఏపీలో అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల పాలసీలు, ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలతో పాటు ఏపీ అభివృద్ధి కోసం రూపొందించిన 2047 స్వర్ణాంధ్ర ప్రణాళికలపై ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవంబర్ 14,15వ తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు రావాల్సిందిగా సింగపూర్ కంపెనీలను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.."అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్ కోసం 2014లో సింగపూర్ దేశానికి వచ్చాను. ఉచితంగా మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన పరిణామాలతో సింగపూర్ ప్రభుత్వంతో ఏపీ సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుత పర్యటన ద్వారా వాటి పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాను. సింగపూర్ అవినీతి రహిత దేశం.అందుకే నాకు సింగపూర్ అంటే అభిమానం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ సమీపంలో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించారు. సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలి. నవంబరు 14-15 తేదీల్లో విశాఖపట్టణంలో పెట్టుబడుల సదస్సు ఉంది. సింగపూర్ నుంచి డెలిగేషన్ ఆ పెట్టుబడుల సదస్సుకు రావాలి. విశాఖ సదస్సులో పెట్టుబడులపై ఎంఓయూలు కుదుర్చుకుందాం. అతి పెద్ద సుదీర్ఘ తీర ప్రాంతం ఏపీ సొంతం. భారత దేశం అతి వేగంగా అభివృద్ధి చెందుతుంది. గతంలో పీ3 అమలు చేశాం.. ఇప్పుడు పీ4 కార్యక్రమం ప్రారంభించాం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే పీ4 ఉద్దేశ్యం. పేదలకు చేయూత ఇవ్వడమనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. పెట్టుబడులే కాదు.. పేదలకూ సాయం చేయాలని ఇదే వేదికగా కోరుతున్నాను." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఏపీలో ఆకాశమే హద్దుగా అవకాశాలు..** "సింగపూర్ నుంచి స్ఫూర్తితో ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. 2047కు స్వర్ణాంధ్ర సాధించాలనే లక్ష్యంతో ప్రజల సామాజిక, ఆర్థిక పురోగతిపై పని చేస్తున్నాం. ఉద్యోగాల కల్పనలో సింగపూర్ ప్రభుత్వానిది అత్యుత్తమ మోడల్. సమీప భవిష్యత్తులో సంప్రదాయ విద్యుత్ వినియోగం నుంచి గ్రీన్ ఎనర్జీ వినియోగానికి మారుతాం. ఇన్వెస్టర్ ఫ్రెండ్లీగా ఉండటంతో పాటు పెట్టుబడులకు భద్రత ఉంటుంది. అమరావతి, విశాఖ, తిరుపతి లాజిస్టిక్ కారిడార్లు ఏర్పాటు అవుతున్నాయి. పెట్టుబడి దారులకు అవసరమైన నైపుణ్యమున్న వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉంచేలా చూస్తున్నాం. పరిశోధనలకు, ఫ్యూచర్ టెక్నాలజీ కోసం అమరావతి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లో భాగంగా ఏపీ నుంచే మూడో వంతు గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పారిశ్రామికాభివృద్ధి కోసం 24 థీమాటిక్ పాలసీలు రూపొందించాం. తక్కువ వ్యయంతో రవాణా, సర్క్యులర్ ఎకానమీని అమలు చేయడం ద్వారా సుస్థిర భవిష్యత్తు దిశగా అడుగులు వేస్తున్నాం. ఎలక్ట్రానిక్ మొబిలిటీ, వేస్ట్ రీసైకిలింగ్, ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులు, ఏరోస్పేస్, డిఫెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ, మారిటైమ్, మైనర్ మినరల్, స్పోర్ట్స్, టెక్స్ టైల్ పాలసీలు రూపొందించాం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ కంపోనెంట్స్, డేటా సెంటర్, ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాం. ఆరు ఆపరేషనల్ పోర్టులు ప్రస్తుతం ఏపీలో అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే మరో 4 పోర్టులు కూడా త్వరలో అందుబాటులోకి వస్తాయి. దేశంలోని మారిటైమ్ కార్గోలో 30 శాతం ఏపీ నుంచే జరుగుతోంది. మారిటైమ్ కార్గో రంగంలో ఏపీకి ఎంతమేర అవకాశాలు ఉన్నాయో మీరే ఊహించుకోవచ్చు. ఏపీకి అనుబంధంగా ఉన్న రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పోర్టు కార్గో హ్యాండ్లింగ్ కు అవకాశం ఉంది. ఏపీలో 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఉన్నాయి. అలాగే మరో 9 ప్రాంతాల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల నిర్మాణం కూడా చేయాలని భావిస్తున్నాం. ఇన్నోవేషన్ సహా విమానాల మరమ్మత్తులు, నిర్వహణ, ఓవర్ హాలింగ్ రంగాల్లోనూ పెట్టుబడులను ఆకర్షించేలా విధానాలు రూపొందించాం. ఇన్ ల్యాండ్ వాటర్ వేస్, రైల్ కార్గో లాంటి సదుపాయాలు కూడా ఏపీలో ఉన్నాయి.

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



**అమరావతి,జూలై 28 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మద్రాసు హైకోర్టు నుండి బదిలీపై రాష్ట్ర హైకోర్టుకు వచ్చిన ఆయనచే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్ రెడ్డి, హైకోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ అదనపు అడ్వకేట్ జనరల్ పి.సాంబశివ ప్రతాప్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన



**న్యూఢిల్లీ,జూలై 28 (వార్తాప్రభ) :** పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపిందని కేంద్రం పార్లమెంటుకు తెలియజేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర జల సంఘానికి అందించినట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ లేఖ రాసినట్లు పార్లమెంటుకు తెలిపింది. ప్రాజెక్టుపై సంబంధిత అధికారులు, పరివాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# కొత్త ఆలోచనలు, ఆధునికత కలయికే అమరావతి

- ఉత్తమ విధానాలతో ఏపీ భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నాం
- సింగపూర్ - ఆంధ్రప్రదేశ్ మధ్య సహకారం కొనసాగాలి
- ప్రభుత్వాల మధ్య అంతరం తగ్గించడమే పర్యటన ఉద్దేశం
- రెండో రోజు సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2 గంటల పాటు కాలినడకన బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు పరిశీలన
- పర్యావరణహితంగా నివాస సముదాయ నిర్మాణంపై ప్రశంసలు






**సింగపూర్, జూలై 28 (వార్తాప్రభ) :** రెండో రోజు సింగపూర్ పర్యటనలో భాగంగా క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. సోమవారం సింగపూర్‌లో 10 వేల కుటుంబాలు నివాసం ఉండే బిడదారి ఎస్టేట్‌ను సీఎం బృందం సందర్శించింది. ఏపీలో భారీ ఎత్తున అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో సింగపూర్ దేశంలో అర్బన్ హౌస్ ప్లానింగ్ ఏ విధంగా ఉందనే అంశాన్ని పరిశీలించేందుకు బిడదారి ఎస్టేటును సీఎం చంద్రబాబు సందర్శించారు. సిటీ ఇన్ ఎ గార్డెన్ పేరుతో ఏర్పాటైన హౌసింగ్ ప్రాజెక్ట్ విశిష్టతలను ముఖ్యమంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. మొత్తం 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హౌసింగ్ ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు సీఎం చంద్రబాబు కాలి నడకన సందర్శించారు. ఈ క్రమంలో ఏపీకి సింగపూర్ దేశానికి ఉన్న అనుబంధాన్ని ఆ దేశ అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను వారితో పంచుకున్నారు. కొత్త ఆలోచనలతో, ఆధునిక వసతులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం ఉత్తమ విధానాలు అనుసరిస్తూ భవిష్యత్ నగరాన్ని తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. అమరావతి కోసం సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకు కూడా భాగస్వామి అవుతోందని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఘటనల కారణంగా సింగపూర్ - ఏపీ ప్రభుత్వాల మధ్య కొంత అంతరం వచ్చిందన్న అంశాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడంతో పాటు.. ఉన్న గ్యాప్ ను తగ్గించేందుకు ప్రస్తుతం తాను సింగపూర్ వచ్చానని తెలిపారు. భవిష్యత్‌లోనూ సింగపూర్-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు.

**ప్రకృతితో మమేకమవుతూ...** బిడదారి ఎస్టేటులో గృహ సముదాయాల నిర్మాణం చేపట్టిన విధానాన్ని సింగపూర్ అధికారులు చంద్రబాబుకు వివరించారు. చెట్లు తొలగించకుండా, సహజ నీటి వనరులు దెబ్బతినకుండా... ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. ప్రకృతితో మమేకమయ్యేలా చేపట్టిన ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి హాని కలగకుండా చూసుకోవడంతో పాటు.. ఆహ్లాదాన్ని పంచే విధంగా నిర్మాణాలు చేపట్టామని ఆ దేశ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గృహ సముదాయాల నిర్మాణం ఖర్చు ఏ మేరకు ఉందనే అంశం పైనా చంద్రబాబు వారితో చర్చించారు. పట్టణ, నగర ప్రాంతాల్లో అందుబాటు ధరల్లో ఉండేలా చూడడంతో పాటు.. నాణ్యమైన నివాస గృహాల నిర్మాణాల చేపట్టామని చంద్రబాబుకు సింగపూర్ అధికారులు చెప్పారు. బిడదారి హౌసింగ్ ప్రాజెక్టును సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు తీర్చిదిద్దిన తీరును ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. సింగపూర్ ప్రభుత్వం చేపట్టిన ఈ హౌసింగ్ ప్రాజెక్టు అన్ని వసతులతో పర్యావరణ హితంగా అద్భుతంగా నిర్మించారని చంద్రబాబు కితాబిచ్చారు. స్మశాన ప్రాంతాన్ని సుందరమైన పార్క్‌గా సింగపూర్ అర్బన్ రీడెవల్పమెంట్ అథారిటీ మార్చడం ఆకట్టుకుందని చంద్రబాబు అన్నారు.

**అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులకు సహకరించండి...** బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు సందర్శన అనంతరం సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు, సింగపూర్ అర్బన్ రీడెవలప్మెంట్ అథారిటీ, సింగపూర్ కార్పొరేషన్ ఎంటర్ ప్రైజ్ సహా ప్రపంచ బ్యాంకు అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఏపీలో చేపట్టనున్న అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ సహకారంపై ఈ భేటీలో చర్చించారు. ఏపీలో, అమరావతిలో చేపట్టబోయే హౌసింగ్ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు అధికారులను ముఖ్యమంత్రి కోరారు. రాజధాని అమరావతి నిర్మాణంలో అనుసరిస్తున్న విధానాలు, ఆలోచనలు, ప్రణాళికలను వారితో పంచుకున్నారు. బిడదారి ప్రాజెక్టును రూపొందించిన విధానం చాలా గొప్పగా ఉందన్నారు.

## హైదరాబాద్-విజయవాడ ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ 'భారీ' శుభవార్త




**హైదరాబాద్,జూలై 28 (వార్తాప్రభ) :** హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రయాణించే వారి కోసం తెలంగాణ ఆర్టీసీ శుభవార్తను ప్రకటించింది. ఈ మార్గంలోని బస్సుల్లో ఛార్జీలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఛార్జీలను 16 శాతం నుండి గరిష్ఠంగా 30 శాతం వరకు తగ్గిస్తున్నట్లు తెలిపింది. ఈ రాయితీలు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ బుకింగ్‌లకు వర్తిస్తాయని పేర్కొంది. 'హైదరాబాద్-విజయవాడ మార్గంలో టిక్కెట్లపై భారీ తగ్గింపు' అంటూ ఒక ప్రకటనను విడుదల చేసింది. గరుడ ప్లస్ బస్సుల్లో టిక్కెట్ ధరపై 30 శాతం, ఈ-గరుడ బస్సుల్లో 26 శాతం ప్రత్యేక తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ బస్సుల్లో టిక్కెట్లపై 20 శాతం, రాజధాని, లహరి ఏసీ బస్సుల్లో 16 శాతం వరకు తగ్గింపు ఉంటుందని వెల్లడించింది.


**పాస్‌పోర్టు పోయినది**

ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్, కానూరు, శివాలయం దగ్గర, డోరు నెం.1-336 కాపురస్తుడు దానరి సుబ్రమణ్యం గారి కుమారుడు దానరి శివకుమార్ అను నాపేరిట విజయవాడలో ది.13-08-2020న జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.యు3287340 మరియు కొన్ని కాగితములు కలిగిన కవర్‌తో ఉన్నటువంటి ఫైల్‌ను చిట్టినగర్, భీమనవారిపేటలోని డోరు నెం.5-6-59/106/2రు చిరునామా గల మా బంధువుల ఇంటిలో ఉంచిఉండగా, ది.30-08-2024లో వచ్చిన వరదలలో కొట్టుకుపోయినది. వెంటనే పరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పానుపోర్టు దొరికినచో నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9676011009


# రాష్ట్రంలో అర్హత గల ప్రతి పేదవానికి పక్కా ఇల్లు.. కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి,వంగలపూడి అనిత వెల్లడి.





**ఏలూరు/కైకలూరు,జూలై 28 (వార్తాప్రభ) :** కైకలూరు సియన్ ఆర్ గార్డెన్స్ లో సోమవారం నియోజక వర్గంలో ఇళ్ళ నిర్మాణాలు,ఇళ్ల పట్టాలు,ఇతర సమస్యలపై రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి,రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ సంయుక్తంగా అధికారులతో సమీక్ష సమావేశం పాల్గొన్నారు.నియోజక వర్గంలో మండలాలు వారీగా ఇళ్ల నిర్మాణాలు,ఇళ్ల స్థలపట్టాలు,ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.కైకలూరు నియోజకవర్గంలో గృహ నిర్మాణ సమస్యలపై స్థానిక సిఎన్ఆర్ గార్డెన్స్ సమీక్ష నిర్వహించారు. కైకలూరు గ్రీన్ విలేజ్,కలిదిండి, మండవల్లి మండలాల్లోని లే అవుట్లలో సమస్యలపై సమీక్ష నిర్వహించారు.తొలుత కైకలూరు గ్రీన్ విలేజీని సందర్శించి అక్కడ అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్థంగా ఉన్న ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారుల సమస్యను,తాగునీటి సమస్యను,విద్యుత్తు వంటి మౌలిక సమస్యలను స్వయంగా పరిశీలించానని అన్నారు.గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో 15 లక్షలు 30 లక్షలు పక్కా గృహాలు నిర్మిస్తున్నామని ఆర్భాటపు ప్రచారాలు చేసి చివరకు లబ్ధిదారులను నిండా ముంచేసిందని ఆరోపించారు. ఒక ప్రణాళిక లేకుండా ఒక విజన్ లేకుండా గృహనిర్మాణ పథకం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు.ఫలితంగా లబ్ధిదారులు తీవ్రంగా నష్ట పోయారని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో అర్హత కలిగిన మిగిలిన ప్రతి పేదవానికి అర్బన్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున నివేశనా స్థలాలు మంజూరు చేసి రూ.2.50 లక్షలు చొప్పున మంజూరు చేస్తుందని తెలిపారు. అదనంగా బీసీలకు,ఎస్సీలకు రూ 50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ 75 వేలు నుంచి రూ 1 లక్ష చొప్పున అదనంగా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారన్నారని తెలిపారు.స్వంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.1 లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. కైకలూరు గ్రీన్ విలేజ్లో అసంపూర్తిగా నిలిచి పోయిన ఇళ్లను త్వరితగతిన క్రొత్త కాంట్రాక్టరుతో నిర్మాణాలు పూర్తి చేస్తామని,అందుకు కావాల్సిన నిధులు సమకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రీన్ విలేజ్లో రోడ్లు,విద్యుత్తు,తాగునీరు వంటి ప్రధాన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మంత్రి సారథి స్పష్టం చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో గృహ నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిగిందని, దాని ఆధారంగా బాధ్యులపై చర్యలు కూడా ఖచ్చితంగా తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం,అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే దమ్ము ఒక కూటమి నాయకులకే ఉందని స్పష్టం చేశారు.ఎందుకంటే సంక్షేమం,అభివృద్ధి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే నని పేర్కొన్నారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు.అలాగే ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అభివృద్ధి జరుగుతోందా లేదా అన్న విషయాలపై బాధ్యతాయుతంగా కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకోవటం గర్వకారణం అన్నారు.గత ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు తప్ప సంక్షేమం,అభివృద్ధి కానరాలేదన్నారు.అలాగే గత ప్రభుత్వంలో దోపిడీలకు, అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిని శిక్షిస్తామని, సంక్షేమ పథకాల అమలుతోపాటు అక్రమార్కులపై చర్యలు ఉంటాయని ఆమె ఉద్ఘాటించారు.కైకలూరు నియోజకవర్గంలో 'డాగ్ ట్రైనింగు సెంటరు' ఏర్పాటుకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రక్షిత తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని,రూ.2.40 కోట్లతో డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. అలాగే కైకలూరు గ్రామ పంచాయతీ సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు. నియోజకవర్గంలో పక్కాగృహ నిర్మాణ వ్యవస్థపై పూర్తిగా అసంతృప్తి ఉందని, కైకలూరు గ్రీన్ విలేజీ రూ 200 కోట్లు ఖర్చుపెట్టినా లబ్ధి దారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. లబ్ధిదారుల ఎంపికలోను తప్పులు జరిగాయని అన్నారు.లే-అవుట్లలో కొన్ని ప్లాట్లు ఇంకా లబ్ధిదారులకు కేటాయించలేదని, రహదారులు నిర్మాణం జరగలేదని,డ్రెయిన్ల నిర్మాణం జరగలేదని,తాగునీరు, విద్యుత్తు సౌకర్యం పూర్తిస్థాయి లో కల్పించలేదని అన్నారు. చాలా ఇళ్లు అసంపూర్తిగా నిలిచి పోయాయన్నారు. అలాగే కలిదిండిలో 600 మందికి ప్లాట్లు కేటాయించారని, రెండు ఇళ్లు మాత్రమే నిర్మాణంలో ఉన్నాయని,మిగిలిన ప్లాట్లు మొత్తం లెవిలింగు చేయాల్సి ఉందని, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.6 నుంచి 7 కోట్లు అవసరం అవుతాయని అన్నారు. మండవల్లిలో కూడా అదే పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాల్సి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఏపి గృహ నిర్మాణ ఎండి యం.శివ ప్రసాదు,మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీ రామకృష్ణ గృహ నిర్మాణ శాఖ పిడి జి.వి.వి. సత్యనారాయణ, డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు,డ్వామా పిడి కె.వి. సుబ్బారావు,జిల్లా పంచాయతీ శాఖ అధికారి కె.అనురాధ, జిల్లా పరిషత్తు సిఇవో యం. శ్రీహరి,ఆర్ బ్ల్యూఎస్ అధికారి జి.త్రినాథ బాబు,పంచాయతీ రాజ్ ఇంచార్జి పిడి కె.శ్రీనివాసు,డిఇలు, అసిస్టెంటు ఇంజినీర్లు, తహశీల్దార్లు, యంపిడివోలు, ఇతర ప్రభుత్వ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్లు, కూటమి నాయకులు,గ్రీన్ విలేజీ లబ్ధిదారులు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యా శిక్షణా స్థాయి కార్యక్రమానికి శ్రీనివాస్



మల్కాజిగిరి :జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి) నూతన విద్యా విధానం కార్యక్రమంలో భాగంగా బోధన అభ్యాసన ప్రక్రియలను ఆసక్తిగా మార్చేందుకు వృత్తి విద్యను బలోపేతం చేసేందుకు మధ్యప్రదేశ్ లో ని భోపాల్ లో ఆగష్టు 4 నుంచి 8 వరకు జరుగుతున్న విద్యా శిక్షణా స్థాయి కార్యక్రమానికి బెస్ట్ టీచింగ్ ఉపాధ్యాయునిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఆయన మల్కాజిగిరి జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో వృత్తి విద్య ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు

# బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలి :: సిపిఎం




ఆగిరిపల్లి, జూలై 28(వార్తా ప్రభ )ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం సబ్ స్టేషన్ దగ్గర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ట్రూ అప్ చార్జీలు సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా నెక్కలం గొల్ల గూడెం సచివాలయం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించి ర్యాలీ నిర్వహించి నెక్కలం గొల్లగూడెం సబ్ స్టేషన్ లో అధికారులకు వినతిపత్రం ఇచ్చి ఈ స్మార్ట్ మీటర్లు పై ప్రజా వ్యతిరేక విధానాలకు ఈ ప్రభుత్వానికి సహకరించొద్దని వినతి పత్రం ఇవ్వడం జరిగినది. సీపీఎం నూజివీడు కార్యదర్శి రాజు మరియు సిపిఎం ఆగిరిపల్లి వ్యవసాయ కార్యదర్శి చాకిరి శివ నాగరాజు మరియు మండల నాయకులు నరేష్, సామియేలు, రవీంద్ర, రాధాకృష్ణ,నల్లమోతు నవీన్ మరియు ఆగిరిపల్లి సిఐటియు మండల కార్యదర్శి రాజులపాటి చంటి, సుందరం, శివ మోహన్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సుపరి పాలన చేసి చూపిస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబు

**ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య**



పెనుగంచిప్రోలు, జులై 28( వార్త ప్రభ ) పెనుగంచిప్రోలు మండలం లోని ముళ్లపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సంవత్సర కాలంలో మన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సుపరి పాలన ఏలా ఉంటుందో చేసి చూపిస్తునారని అన్నారు.ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి నీ సంక్షేమ పథకాలను ప్రజల కు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, డీసీ చైర్మన్ ఏలూరు గోపాలరావు, తెలుగు యువత నాయకుడు ఉమ్మినేని పుల్లారావు, చంద్రుపట్ల లక్ష్మీనరసింహారావు, గుత్త హనుమంతరావు, సంజీవ్ రెడ్డి, జెడ్ పి టీ సి గజ్జి కృష్ణమూర్తి, జిల్లేపల్లి సుధీర్ బాబు, నలజాల శైలజ, అయిలపోగు వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు,,

# ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి.కలెక్టర్ రాజర్షి షా

**-ప్రజావాణిలో 114 దరఖాస్తులు స్వీకరణ**


అదిలాబాద్ జులై 28( వార్త ప్రభ )జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెనీ కలెక్టర్ సలోని లు పాల్గొని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 114 దరఖాస్తులు స్వీకరించగా,భూ సమస్యలు, పెన్షన్లు,విద్యుత్ సమస్యలు, విద్య ,వైద్యం తదితర విభాగాలకు సంబంధించినవిగా తెలిపారు.అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి,వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ గ్రీవెన్స్ లో ఆర్డీవో స్రవంతి,ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది,తదితరులు ఉన్నారు.

# అగర్వాల్ సమాజ్ సభ్యులందరికీ ప్రివిలేజ్ కార్డ్‌లు

**అగర్వాల్ సమాజ్ తొలి సర్వసభ్య సమావేశంలో తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా**







హైదరాబాద్ : జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)అగర్వాల్ సమాజ్ సభ్యులందరికీ ప్రివిలేజ్ కార్డ్‌లు అందించనున్నట్లు తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా వెల్లడించారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ కేంద్ర కమిటీ సభ్యులు, శాఖ కార్యవర్గ సభ్యుల అత్యవసర మొదటి ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఆదివారం మహారాజా అగ్రసేన్‌జీ పూజతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అనిరుధ్ గుప్తా అందరికీ స్వాగతం పలికారు. అనంతరం ఐదుగురు సలహాదారులను పరిచయం చేశారు. కేంద్ర కమిటీ సభ్యత్వ రుసుమును సంవత్సరానికి రూ. 350 నుండి రెండు సంవత్సరాలకు రూ. 21 కి తగ్గిస్తూ ఆమోదం తెలిపింది. ఇకపై సభ్యత్వ రుసుమును మార్చే అధికారం కేంద్ర కమిటీకి ఉంటుంది. ఈ సందర్భంగా అనిరుధ్ గుప్తా మాట్లాడుతూ అగర్వాల్ సమాజపు ఎన్నికల్లో కేంద్ర కమిటీ పదవీ విరమణ చేసిన అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడితో పాటు, శాఖల పదవీ విరమణ చేసిన అధ్యక్షులకు కూడా ఓటు హక్కు కల్పించే ప్రతిపాదనను ఆమోదించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డా. అంజనీ కుమార్ అగర్వాల్, డా. చంద్రకాంత్ దకోటియా, హరీష్ గుప్తా, బద్రీ విశాల్ బన్సల్, వినోద్ అగర్వాల్. ఈ కార్యక్రమంలో సలహాదారులు డా. అంజనీ కుమార్ అగర్వాల్, డా. చంద్రకాంత్ దకోటియా, హరీష్ గుప్తాలను సత్కరించారు. డాక్టర్ సీమా అగర్వాల్ వేదికను సమన్వయించి, గత సమావేశపు నివేదికను సమర్పించి ఆమోదం పొందారు. ముఖ్య చర్చలు, తీర్మానాలు, అనేక కీలక అంశాలపై చర్చించి, ప్రతిపాదనలను వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. అనంతరం అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ప్రారంభంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అనిరుధ్ గుప్తా (అధ్యక్షుడు), రూపేష్ కుమార్ అగర్వాల్ (ఉపాధ్యక్షుడు), డా. సీమా జైన్ (సహ-కార్యదర్శి), అచల్ గుప్తా (కోశాధికారి), డా. అంజనీ కుమార్ అగర్వాల్ (సలహాదారు), డా. చంద్రకాంత్ దకోటియా (సలహాదారు), హరీష్ గుప్తా (సలహాదారు) పాల్గొన్నారు.

# రేవంతన్న గొప్ప మనసు ఉన్న ప్రజా నేత

**మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునీ ఆర్థికంగా ఎదగాలి**

**పీఏసీ చైర్మన్, శాసనసభ్యులు అరికెపూడి గాంధీ**




శేరిలింగంపల్లి,జులై 28 (వార్తాప్రభ):మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా ఉచితంగా 9 మంది క్రిస్టియన్ మైనారిటీ మహిళ సోదరీమణులకు కుట్టు మిషన్ల ను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి 9 మంది లబ్దిదారులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా పథకం కింద క్రిస్టియన్ మైనార్టీ సోదరీమణులకు ఉచితంగా 9 మందికి కుట్టు మిషన్లు అందచేయడం చాలా సంతోషకరమైన రోజు అని,పేద మహిళల జీవితాలలో వెలుగులు నింపిన రోజు అని,మహిళలు ఆర్థికంగా ఎదగడానికి గొప్ప అవకాశంను ప్రభుత్వం కలిపించిందన్నారు.,మహిళలు తమ స్వంత కాళ్ళ పై నిలబడి కుటుంబ పోషణ కు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని,ఆర్థికంగా ఎదగాలని పీఏసీ చైర్మన్ గాంధీ కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల పక్షపాతి అని,గొప్ప మనసున్న నేత అని,మహిళల సంక్షేమం కొరకు అనేక పథకాలు ప్రవేశపెట్టింది ఒక తెలంగాణ ప్రభుత్వమే అని,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలతో ప్రతి ఇంట్లో ఆడబిడ్డ పెండ్లికి భరోసా కల్పిస్తున్నారు.మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ కుట్టు మిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయి అని,ఈ చక్కటి అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.మహిళలను అన్ని రంగాల్లో ముందు నిలిచేలా చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యం అని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు.ఈ కార్యక్రమంలో నజియా బేగం మరియు నాయకులు సందీప్ రెడ్డి,నరేందర్ బల్లా,శివ ముదిరాజు,నరేష్ మరియు కార్యకర్తలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే తమ్ముడు శ్రీనివాస్ గౌడ్ ఇబ్బందులను తాళలేక ఓ యువకుడి మృతి

**పనిచేసే సంస్థలో కోటి రూపాయల పైచిలుకు దొంగిలించాడని అభియోగం**

**మనస్థాపనతో ఆత్మహత్య చేసుకున్న యువకుడు**

**గతంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నుండి ఎంపీపీగా పనిచేసిన శ్రీనివాస్ గౌడ్**



కుత్బుల్లాపూర్ జూలై 28 (వార్తాప్రభ) : కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తమ్ముడు ఇబ్బందులను తాళలేక ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే తమ్ముడు శ్రీనివాస్ గౌడ్ కు చెందిన సమ్మక్క సారక్క కాంక్రీట్ వర్క్ లో కుమార్ యాదవ్ అనే యువకుడు 8 సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఇతను పనిచేసే కంపెనీలో కోటి రూపాయల పైచిలుకు దొంగిలించాడని ఎమ్మెల్యే తమ్ముడు శ్రీనివాస్ గౌడ్ నెపం మోపాడు. అయితే తనకు ఈ విషయంలో ఎలాంటి సంబంధం లేదని ప్రతిదీ తనకు లెక్క చెప్పానని అయినా శ్రీనివాస్ గౌడ్ వినకుండా తనను ఇబ్బందులకు గురి చేశాడని, శ్రీనివాస్ గౌడ్ మనుషులు కుమార్ యాదవ్ కు చెందిన టాటా టియాగో కారు, సెల్ఫోన్ లాక్కొని వెళ్లారని, మనస్థాపనతో తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, తమ కుమారుని చావుకి కారణం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తమ్ముడు శ్రీనివాస్ గౌడ్ అని మృతిని తల్లిదండ్రులు ఆరోపించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ జూలై 28 (వార్తాప్రభ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన జి.నర్సయ్య, జరిపేటి బ్రమేశ్వర్, వీర్ల సువర్ణ,జాలిం పవన్,యండి బషీరుద్దీన్,నక్క సురేష్ బాబు,కరల కాంత, నగల నాగమణి, జయలక్ష్మి, సంపంగి బాలమణి, టేకులపల్లి అశోక్ గౌడ్ గతంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి సోమవారం తన నివాసం వద్ద 5 లక్షల రూపాయల సిఎంఆర్ఆఫ్ చెక్కులు పంపిణి చేశారు. అనంతరం అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేద ప్రజలు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ గారు మాట్లాడుతూ సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం పేదలకు కొండంత భరోసాగా మారిందాన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని కొనియాడారు. ప్రజాపాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా కార్పొరేట్ తరహాలో వైద్యం అందించడంతో పాటు వైద్యనికి అయినా ఖర్చులు సిఎంఆర్ఆఫ్ ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సిఎంఆర్ఆఫ్ చెక్కులు అందుకునే ప్రతి లబ్దిదారుని చిరరునవ్వుతో చిరకాల జ్ఞానుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.


వార్తా ప్రభ

# హైదరాబాద్

# నిరుద్యోగ యువతకు సదావకాశము!!

**శిక్షణ పొంది ఉద్యోగం సాధించండి**

**ఎన్టీపిసి ఈడి చందన్ కుమార్ సమంత**



పెద్దపల్లి/ గోదావరిఖని: జూలై 28 (వార్తాప్రభ ప్రతినిధి)నిరుద్యోగ యువతకు ఎన్టీపిసి సీఎస్ఆర్ ద్వారా సదావకాశము కల్పిస్తున్నట్లు ఎన్టీపిసి ఈడి చందన్ కుమార్ సమంత ప్రకటనలో వివరాలను వెల్లడించారు. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిఐపిఈటి) ప్రతినిధి ధర్మరాజు సోమవారం ఈడి సమంతను కలిసి సిఐపిఈటి ద్వారా శిక్షణ అలాగే ఉద్యోగ అవకాశాలను కల్పించే విధివిధానాలను క్లుప్తంగా వివరించిన అనంతరం, స్థానిక నిరుద్యోగ యువత, ప్రభావిత గ్రామాల యువతి యువకులు 9441247207 నెంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మిషన్ ఆపరేటర్స్, ప్లాస్టిక్ మోల్డింగ్ ప్రొఫెషనల్ అర్హత కలిగిన అభ్యర్థులకు వందశాతం ప్లేస్మెంట్ హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు.

# లిటిల్ స్టార్" చిల్డ్రన్స్ క్లినిక్ ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్ జూలై 28 (వార్తాప్రభ) : కుత్బుల్లాపూర్ 132 - జీడిమెట్ల డివిజన్ పైప్ లైన్ రోడ్ కోణార్క్ హాస్పిటల్ సమీపంలో డాక్టర్ జే.వికాస్ రెడ్డి, డాక్టర్ శివానిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన లిటిల్ స్టార్ చిల్డ్రన్ క్లినిక్ ను సోమవారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన హాస్పిటల్ ఏర్పాటు ఎంతో అవసరమని, ఈ ప్రాంతంలో పిల్లలకు ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, ఎల్లా గౌడ్, పులి మహేష్, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్పోర్ట్స్ ఐకాన్ అవార్డు గ్రహీత ఎస్ ఎస్ వి ప్రసాద్ కు ఘన సన్మానం,




కాప్రా,జూలై 28:(వార్తా ప్రభ) అసరా సర్కిల్ కమిటీ కాప్రా సర్కిల్ వన్ జిహెచ్ఎంసి హైదరాబాద్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఈసీ నగర్ చర్లపల్లి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో 23 వ తారీకు రోజున సర్వ సభ్య సమావేశం నిర్వహించగా అందుకు ప్రెసిడెంట్ వరప్రసాద్ స్వాగతం పలుకగా వైస్ ప్రెసిడెంట్ సీనియర్ సిటిజన్స్ కావలసిన, వారు అడిగిన సమస్యలను సామరస్యంగా పరిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు, జిహెచ్ఎంసి సెంట్రల్ కమిటీ సభ్యులు హాజరై తెలంగాణ స్పోర్ట్స్ ఐకాన్ అవార్డు గ్రహీత అయినటువంటి ఎస్ఎస్ వి ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా వాలీబాల్ ఆటలు ఎన్నో టోర్నమెంట్స్ నిర్వహించి కోచ్గా, రిఫరల్ గా, మేనేజర్ గా వ్యవహరించిన ఎస్ ఎస్ వి ప్రసాద్ ను పేరు ప్రఖ్యాతలు పొందాలని ప్రశంసించారు. వారు మాట్లాడుతూ మీ అందరి సమక్షంలో ఈ సత్కారం నాకెంతో గొప్పగా జరగడం సంతోషం కల్పించిందని అన్నారు. అందరికీ పేరుపేరునా సీనియర్ సిటిజన్ సభ్యులకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరికలు

అదిలాబాద్ జూలై 28:(వార్తా ప్రభ) ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ లో చేరుతున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జైనథ్ మండలం ఆనంద్పూర్,సాత్నాల మండలం సాంగ్వి గ్రామాలకు చెందిన కాంగ్రెస్,బిఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు.

# ఎడిటోరియల్

## నసేన ఆశలపై నీళ్లు జల్లిన సుప్రీం.. టీడీపీకి షాకేనా?

వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని గంపెడాశలు పెట్టుకున్న నేతలకు సుప్రీంకోర్టు తీర్పు షాక్ ఇచ్చినట్లైంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా అసెంబ్లీ సీట్లు పెంచాల్సిఉండగా, జనాభా లెక్కలు తేలనందున నియోజకవర్గాల పునర్విభజనకు చట్టం అనుమతించందని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందని అంటున్నారు. మరోవైపు వచ్చే ఏడాదిలో జనాభా లెక్కలు సేకరించాలని కేంద్రం ఇప్పటికే నిర్ణయించినందున నియోజకవర్గాల పునర్విభజనకు 2034 వరకు ఆగాల్సిందేనన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.సుప్రీం తీర్పుతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ప్రధానంగా ఏపీలో రాజకీయ అనిశ్చితికి దారితీయొచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొనసాగుతోంది. మూడు పార్టీల మధ్య పొత్తుతో గత ఎన్నికల్లో పోటీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ గెలవ కూడదన్న ఏకైక లక్ష్యంతో కూటమి కట్టిన పార్టీలు సీట్లను త్యాగం చేయాల్సివచ్చింది. రాష్ట్రంలో మొత్తం 175 నియోజకవర్గాలు ఉండగా, జనసేన, బీజేపీలకు 29 సీట్లను టీడీపీ వదులు కోవాల్సివచ్చింది. అయితే ఈ కూటమి ఏర్పడటానికి ప్రధాన కారణమైన డిప్యూటీ సీఎం పవన్ తన పార్టీని బాగా తగ్గించి 21 సీట్లకే ఒప్పుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే ఏదో ఒకవిధంగా అంతా ఏకతాటిపైకి వచ్చి పోటీ చేసి గెలిచారు. అయితే అప్పట్లో ఈ సీట్ల సర్దుబాటు 2024 ఎన్నికలకే పరిమితమని, 2029 ఎన్నికల నాటికి మరో 50 అసెంబ్లీ సీట్లు పెరుగుతాయనే అంచనాతో పొత్తు శాశ్వతంగా కొనసాగించాలని నిన్న మొన్నటివరకు మూడు పార్టీలు భావించాయి. సీట్లు పెరిగితే ఆ మేరకు జనసేన కోటా కూడా పెరిగే అవకాశం ఉన్నందున తన పార్టీకి మేలు జరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ భావించారు. అయితే సుప్రీం తీర్పుతో పరిస్థితి రివర్స్ కావడంతో రాష్ట్ర రాజకీయాలు కూడా చర్చనీయాంశంగా మారాయని అంటున్నారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో కూటమి రాజకీయాలపై ఒత్తిడి తీసుకువచ్చే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు.నియోజకవర్గాలు పెరగకుంటే ప్రస్తుతం అధికార కూటమిలో కీలకంగా ఉన్న తెలుగుదేశం పార్టీకి ఇబ్బందే అన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2029 ఎన్నికల నాటికి 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగితే గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వారికి కూడా న్యాయం చేయొచ్చని, నేతలు అందరికీ ఎక్కడో ఒక చోట సర్దుబాటు చేయొచ్చని ఇన్నాళ్లు టీడీపీ లెక్కలేసుకుంటూ వచ్చిందని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి తీసుకున్న కొందరు నేతలకు కొత్తగా ఏర్పడబోయే స్థానాల్లో సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. రాజ్యసభ స్థానానికి రాజీనామా చేసి టీడీపీలో చేరిన సీనియర్ నేత మోపిదేవి వెంకటరమణకు రేపల్లె బదులుగా కొత్తగా ఆవిర్భవించే మరో స్థానం ఇస్తామని ఆశపెట్టినట్లు చెబుతున్నారు. అలాగే వచ్చే ఎన్నికల నాటికి ఏలూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడుతుందన్న అంచనాతో వైసీపీలో పనిచేసిన ఆళ్ల నానిని తీసుకున్నారు. ఇలా చాలాచోట్ల ముందస్తు వ్యూహంతో నేతలను చేర్చుకోగా, ఇప్పుడు మరో ఐదేళ్లు ఆలస్యం అయ్యే సూచనలతో టీడీపీలో కొత్త చిక్కులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

# ధర్మస్థలిహత్యోదంత ఘటన ల సిట్ దర్యాప్తు ను వేగవంతం చెయ్యాలి......

### దోషులందరిని కఠినంగా శిక్షించాలి..... మహిళా సంఘాల ఐక్య వేదిక డిమాండ్......







**విజయవాడ పశ్చిమ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ధర్మస్థల హత్యోదంత ఘటనలు తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయని,పారిశుద్ధ్య కార్మికుడు విజిల్ బ్లోవర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని ఆధారం చేసుకుని,సిట్ బృందం తక్షణమే సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని,మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు... ధర్మస్థల హత్యోదంత లో ఉన్న వ్యక్తులు సంస్థలు,జరిగిన హత్యలు,నేరాల ఉదంతాలు బయటకు తీసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మహిళా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నేడు విజయవాడ లెనిన్ సెంటర్ లో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నా లో పాల్గొన్న భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కర్ణాటక ధర్మస్థలి ఆలయప్రాంతం లో జరిగిన దారుణ ఘటనలపై విచారణ మందకొడిగా సాగుతున్నదినీ,,బాధితులకు న్యాయం జరుగుతుందా అనే అనుమానం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.1983 నుండి ఇప్పటి వరకు అదేప్రాంతం లో అనేక మంది మహిళలు, యువతులు,బాలికలు మిస్ అయిన సంఘటనలున్నాయని పలుమార్లు కేసులు దర్యాప్తులు,చట్టసభలలో చర్చలు జరిగాయని,ఏది సక్రమంగా విచారణ జరగలేదని,ఆర్థిక బలం అండబలం,అధికార బలం తో వ్యవస్థ లోని లోపాలను ఆధారంగా చేసుకుని దోషులు తప్పించుకున్నారనీ ఘటనలకు సంభవించిన ఆధారాలు, సాక్ష్యాలు,విడియో లు కూడా మాయం చేసినట్లు వస్తున్న వాస్తవ కథనాలు దోషులు ఎంతటి బలమైన వారు అనేది తెలుస్తున్నది అని ఆవేదన వ్యక్తం చేశారు.1995 నుండి 2014వరకు పనిచేసిన మాజీ పారిశుద్ధ్య కార్మికుడు అనేకమంది అత్యాచార ఆనవాళ్లు ఉన్న బాలికల,మహిళల శవాల్ని తాను నేత్రావతి నదీపరివాహక ప్రాంతంలో పూడ్చిపెట్టానని,. ఆలయ ట్రస్టీ చాలా రాజకీయ , అధికార ,డబ్బు పలుకుబడి కలవారని ఎన్ని ప్రభుత్వాలు మారినా అందరిని మేనేజ్ చేయగలరని బాలికలు,మహిళలు మిస్సింగ్ విచారణల పై వార్తలు రాకుండా కోర్టు ఆర్డర్ కూడా తెచ్చారని తాను భయపడి అదేరంగంలో బాగం కాలేక పారిపోయానని పాపభీతి వెంటాడుతుండటంతో ఇప్పుడు బయట పెడుతున్నానని చెప్పాడనీ,ఈ విషయాన్ని ఆయన విశ్రాంత సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ గోపాల్‌గౌడ్ మరియు పత్రికల వారి సమక్షంలో చెప్పాడనీ,తాను పూడ్చిపెట్టిన అమ్మాయి తాలుకా ఎముకలు తీసుకొని వెళ్లి చూపించి ఇతరుల ఆదారాలను కూడా చూపిస్తాను రమ్మనమని పదే పదే పోలసు వారిని కోరాడనీ, టెంపుల్‌టౌన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసువారు వెంటనే ప్రాధిమిక సాక్ష్యాధారాల్ని సేకరించుకొని సాక్ష్యాల్ని రక్షించాల్సిన వారు ఆ పని చేయడం లేదనీ.పైగా పిర్యాదు దారునికి బ్రెయిన్ మ్యాపింగ్ టెస్ట్, నార్కోటెస్ట్‌లు, ఫింగర్ ప్రింట్ టెస్ట్‌లు చేసుకుంటూ కాలం గడిపారనీ,విచారణలో జాప్యం ఎందుకు అని ప్రశ్నించారు..తప్పు చేయనపుడు భయమెందుకు..దోషి అన్నపుడు మీ నిర్దోషిత్వం ను నిరూపెంచుకోవాల్సిన బాధ్యత ఆలయ ట్రస్ట్ యాజమాన్యం పై ఉందని అన్నారు.ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ ఈ ఘటనలో సమగ్ర దర్యాప్తుకు న్యాయవాదులు, ప్రజలు ఆందోళన చేసిన తరువాత మాత్రమే సిట్ వేశారనీ,దానికి కూడా కాలపరిమితిని విధించలేదనీ. గతంలో మిస్ అయిన యువతుల తల్లిదండ్రులను ఆలయ ట్రస్టీ బాద్యులు తిట్టి దాడి చేసి పంపించారని వారు మరలా వచ్చి పిర్యాదు చేస్తున్నారనీ,ఈ ఘటనలు ఒక ధర్మానికో, మతానికో సంబందించినవి కావు. మహిళల పై బాలికల పై జరిగిన సామూహిక అత్యాచారాలు,హత్యలు,సామూహిక దహనాలు,ఖననాకి సంబంధించిన విషయం. ఇటువంటి ఆరోపణలు ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదనీ గతంలో వచ్చిన వార్తలకు అత్యంత ప్రభావితమైన ఆలయ ట్రస్టీలు కోర్టులో గాగ్ ఆర్డర్స్ తెచ్చి వాస్తవాలను ప్రచారం కాకుండా చేశారనీ,ఇప్పుడు కూడా వారి ప్రభావంతోనే దర్యాప్తు నత్తనడక నడుస్తుందనీ అన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు ఆర్.గంగాభవాని మాట్లాడుతూ బీజేపీ పాలనలో గోవుకున్న రక్షణ మహిళకు లేదని,వందలమంది మహిళలను చంపిన దోషులు సమాజంలో గొప్ప వ్యక్తులు గా చెలామణి అవుతున్నారని అన్నారు..గత పిర్యాదుల్ని దృష్టిలో పెట్టుకొని అయినా సుప్రీంకోర్టు సుమోటోగా ఈ విషయాన్ని తీసుకొని దర్యాప్తుకు ఆదేశించి ఉంటే వెంటనే ఉపయోగపడి ఉండేది.ఇప్పటికే చాలా కాలాతీతం అయ్యింది. ఇప్పటికైనా జుడిషయరీ జోక్యం చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఐద్వా నాయకురాలు ఝాన్సీ మాట్లాడుతూ ఈ కేసు దర్యాప్తులో సాక్ష్యాల రక్షణ చేపడుతూ అన్ని అవశేషాల్ని వెలికి తీయాలినీ అన్నారు. పో ఓ డబ్ల్యూ నుండి పద్మ మాట్లాడుతూ గతంలో తప్పిపోయిన అమ్మాయిల కుటుంభ సభ్యుల ఫిర్యాదుల పై సమగ్రంగా విచారించాలని పోలీసుల్ని ఆదేశించాలన్నారు..ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ ఫోర్సెనిక్ నిపుణుల బృందంతో శాస్త్రీయ దర్యాప్తు జరపాలినీ,పిర్యాదుదారునికి , సౌజన్య తల్లికి న్యాయవాదులకు భద్రత మరియు రక్షణ కల్పించాలి అన్నారు. అనంతరం మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి వందన సమర్పణ చేసారు.నగర నాయకులు బంకా ఝాన్సీ లక్ష్మి, కె.శైలజ,డి.పుష్పావతి, మూలి ఇందిర, చింతాడ పార్వతి,నిలాపు భాగ్యలక్ష్మి, బి.శాంత, నక్కా రాజ్యలక్ష్మి, మేకా పార్వతి,ఎస్కె నాగుర్ బి,సీహెచ్ అనిత, వెలంగిని రాణి, భువన సుందరీ, ఐద్వా ఎస్ కే. షకీలా తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వెలంపల్లి, దేవినేని, మల్లాది



**విజయవాడ పశ్చిమ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని సోమవారం తాడేపల్లి లోని వారి నివాసం నందు మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్, సెంట్రల్ ఇంచార్జ్ మల్లాది విష్ణు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రజారోగ్యం పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్



**విజయవాడ పశ్చిమ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు.. ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్ ఓ సీ ను (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందజేశారు..43 వ డివిజన్ ఊర్మిళ నగర్ కు చెందిన పంగా వీరాంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.. అతనికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా బాధితుని భార్య వరమ్మ కు రూ 5 లక్షల 21 వేల ఎల్ ఓ సీ ను అందజేశారు.. ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల ఆరోగ్య సమస్యలను రూపుమాపేందుకు త్వరలోనే సంచార వైద్యశాలలను ప్రారంభించడానికి సిద్ధమయ్యారని అన్నారు.. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు నున్న కృష్ణ, లవిన్ బాబు, ఏలూరి సాయి శరత్, వల్లూరు మధుసూదన రావు, రేగళ్ల లక్ష్మణరావు,మంగళపురి మహేష్ , గోవిందమ్మ గాయత్రి ,విజయకుమారి, సుజనా మిత్రా. కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## మెరుగైన వైద్యం కోసం ఎల్. ఓ .సీ అందజేత

### కూటమి నేతలతో కలిసి అందజేసిన ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్



**విజయవాడ పశ్చిమ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్.ఓ.సి ను (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, 44 వ డివిజన్ టీడీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, మరియు కూటమి నేతలతో కలిసి అందజేశారు. 44వ డివిజన్ విద్యాధర పురం కు చెందిన నూనె రామ్మోహన్ రావు(70) హృద్రోగం తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనకి మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలుపగా 44 వ డివిజన్ టీడీపీ నాయకులు మైలవరపు దుర్గారావు ఎన్డీఏ కార్యాలయంలో ఎల్. ఓ .సీ కొరకు దరఖాస్తు చేశారు.వారికి రూ5 లక్షల ఎల్.ఓ.సీ ను అడ్డూరి శ్రీరామ్,ఎన్డీఏ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమినేతల తో కలిసి అందజేశారు. త్వరితగతిన ఎల్.ఓ.సి మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు అబ్దుల్ అజీజ్, తాజుద్దీన్, కనకరావు , సుజనా మిత్రా కోఆర్డినేటర్లు దొడ్ల రాజా, కొల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు .

# మీకోసం అర్జీలను సకాలంలో పరిష్కరించాలి




...... ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

**మచిలీపట్నం జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుండి అందే మీకోసం అర్జీల పట్ల అత్యధిక ప్రాధాన్యతతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, అదనపు ఎస్పీ సత్యనారాయణ, కే ఆర్ ఆర్ సి ఎస్ టి సి శ్రీదేవి, ఆర్డిఓ స్వాతి, మెప్మా పిడీ సాయిబాబుతో కలిసి మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాలను ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎంతో ఓపికగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులను పిలిపించి వాటిని పరిష్కరించాలని సూచించారు.లెక్టరేట్లో మొత్తం 148 అర్జీలు జిల్లా యంత్రాంగం స్వీకరించింది. ఇందులో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి:మొవ్వ మండలం నిడుమోలు గ్రామానికి చెందిన ఆలమూరీ కౌసల్య తనకు గ్రామంలో సర్వే నంబర్ 827/1, 990/3లో ఎన్ హెచ్ 9 పై పట్టా భూమి 1027 చదరపు గజాల భూమిలో జాతీయ రహదారి వారి అవసరాల నిమిత్తం 364 చదరపు మీటర్లు తీసుకున్నారని, మిగిలిన తన పట్టా భూమిని 22ఏలో ఉంచి సబ్ డివిజన్ చేయనందున తన భూమిని కుటుంబ అవసరాలకు రిజిస్టర్ చేయుటకు రిజిస్ట్రార్ కార్యాలయంలో వీలు కుదరడం లేదని, తనకు 22 ఏ నుంచి సబ్ డివిజన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామ కాపురస్తులు కే.పేత్రిరాజు తనకు పిత్రార్జితంగా సంక్రమించిన భూమి రీ సర్వేనెంబర్ నంబర్ 44/1 లో 0.33 సెంట్లు సాగు భూమి ఉందని, నేటికీ ఆ భూమికి శిస్తులు చెల్లిస్తున్నానని, గ్రామంలో ఇటీవల నిర్వహించిన రి సర్వేలో 4 సెంట్లు తగ్గిందని అధికారులు తెలిపారని, సర్వేలో తగ్గిన భూమిని రీ సర్వే చేసి భూమి అప్పగించాలని సదరు భూమికి పాస్ పుస్తక మంజూరు చేయాలని కోరుతూ అనేకసార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు తప్ప ఇప్పటివరకు పాస్ పుస్తకం మంజూరు చేయలేదని తగ్గిన 4 సెంట్లకు సంబంధించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.ఉయ్యూరు మండలం కాటూరు గ్రామం 12, 13 వార్డులలో సిసి రోడ్డు నిర్మిస్తున్నారని ఆ రోడ్డుమీద ఆక్రమించి కొందరు ఇల్లు కట్టుకున్నారని ఆ ఇళ్లను పూర్తిగా తొలగించి రోడ్డు నిర్మాణం జరిగితే గాని పొలాల నుండి వచ్చే టాక్టర్లు ఎడ్లబండ్లు తిప్పుకొనుటకు ఖాళీ ఉంటుందని తెలియజేస్తూ గ్రామస్తులు మందాడ నాగేశ్వరరావు కామూరు కోటేశ్వరరావు కే శరత్ బాబు కే సుబ్రహ్మణ్యం కొడాలి ఆనందరావు విజ్ఞాపన పత్రం అందజేశారు.మండల కేంద్రమైన మోపిదేవి గ్రామ కాపురస్తులు కామిశెట్టి జయకృష్ణ తనకు రీ సర్వే నంబరు 220/1, 220/2 5ఏ,బి నందు 1.62 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, గత 4 సంవత్సరాలుగా పొలంలోని మురుగునీరు గరికిపాటి బుల్లిబాబు సిమెంటు షాపు నుండి శ్రీ భాషిత స్కూలు వరకు డ్రైనేజీ మట్టితో మూసుకుపోవడం వలన మురుగునీరు కిందకు వెళ్లక పంట సమయంలో తాను ఇతర ఆయకట్టు రైతులు ఇబ్బందులకు గురవుతున్నామని అధికారులకు విన్నవించిన ఏమి చర్యలు తీసుకోనలేదని ఇకనైనా మురుగునీరు కిందకు ప్రవహించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు. కోర్టు ధిక్కరణ కేసులకు సంబంధించి జల వనరుల శాఖ ఇంకా రెండు కౌంటర్ ఫైళ్ళు వెంటనే దాఖలు చేయాలన్నారు. ఇతర కోర్టు కేసులకు సంబంధించి 48 కౌంటర్లు దాఖలు చేయవలసి ఉండగా 11 మాత్రమే దాఖలు చేశారని మిగిలినవి కూడా వెంటనే దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కే. కన్నమ నాయుడు, డ్వామా, డి ఆర్ డి ఎ పి డి లు శివప్రసాద్, హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి మనోహరరావు, పంచాయతీరాజ్ ఎస్.ఈ రమణ రావు,రహదారులు భవనాలు ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈలు లోకేష్ , నటరాజు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో బైక్ దగ్ధం



**మచిలీపట్నం జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక వల్లూరి రాజా గారి సెంటర్ హోటల్ ఎదురుగా ఉన్నటువంటి మెకానిక్ షాపులో సోమవారం బైక్ రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పెట్రోల్ పైపు లీక్ అవడం వల్ల మంటలు చెలరేగాయి. స్థానిక ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. బైక్ దగ్ధం కావడంతో తృతిలో తప్పిన ప్రమాదం. చాకచక్యంగా వ్యవహరించి మెకానిక్ ఇసుకతో గోనిపట్టాలతో మంటలను ఆర్పడం వలన పెద్ద ప్రమాదమే తప్పింది. వేసవికాలం తలపించే ఈ ఎండల తాకిడికి బయటికి వెళ్లే వాళ్ళు కాస్త జాగ్రత్తగా ఉండాలి.

## మీకోసం లో రైతు సమస్యలపై ఇంచార్జ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన పేర్ని కిట్టు.

**మచిలీపట్నం జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రైతులకు పంట సమయంలో యూరియా, డిఏపి బస్తాలు అందటం లేదని రైతుల సమస్యలను మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయం మీకోసం లో ఫిర్యాదు చేసిన వైఎస్ఆర్సిపి మచిలీపట్నం ఇంచార్జ్ పేర్ని కిట్టు. మచిలీపట్నంలో నియోజకవర్గం పలు ప్రాంతాలలో రైతులకు ఎరువులు యూరియా డిఏపి బస్తాలు అందడం లేదని కూటమి ప్రభుత్వం నాయకులకు తప్ప సామాన్య రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని కూటమి ప్రభుత్వంపై పేర్ని కిట్టు ధ్వజమెత్తారు. రైతుల సమస్యపై మీకోసం లో ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు



అర్జీ ఇచ్చిన అనంతరం మీ ం డి య ా తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వ ా ట్ల ా డ ు త ూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. పంట సమయంలో ప్రతి సంవత్సరం ఇచ్చే పెట్టుబడి సాయం ఇవ్వకపోగా, రైతులకు యూరియా, డిఏపి పస్తాలు కూడా దొరకడం లేదని దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విత్తనాలు కూడా దొరకడం లేదన్నారు. నియోజవర్గంలో అధికారులు రైతులకు సక్రమంగా ఇవ్వడం లేదని పేర్ని కిట్టు ధ్వజమెత్తారు.

# ఎన్డీయే కూటమి ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కృషి

### ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్





**విజయవాడ పశ్చిమ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భవానిపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో పశ్చిమ లోని నిరుపేద చిరు వ్యాపారులకు ఇద్దరికీ ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ , ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి టిఫిన్ బండి, మరియు తోపుడు బండిని పంపిణీ చేశారు..ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో సుమారు రూ 40 వేలు విలువజేసే బండ్లను అడ్డూరి శ్రీరామ్,ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి వారికి అందించారు.. 56 వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేటకు చెందిన అత్తలూరు రామ్మోహన్ రావు టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనోపాధి సాగిస్తునాడు నిరుపేద ఐన రామ్మోహన్ రావు కు టిఫిన్ బండి అందజేయాలని 56 వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నున్న కృష్ణ ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తు చేయగా టిఫిన్ బండిని అందజేశారు .అదేవిధంగా 51 వ డివిజన్ నెహ్రూ బొమ్మ సెంటర్ కు చెందిన పోలవరపు చంద్రమ్మ కు తోపుడు బండిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుజనా చౌదరి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అందులో భాగంగానే చిరు వ్యాపారులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ఈ తోపుడుబండ్లను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. చిరు వ్యాపారస్తులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ఎల్లప్పుడూ అండగా ఉంటారని అడ్డూరి శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు నున్న కృష్ణ, లవిన్ బాబు, ఏలూరి సాయి శరత్, వల్లూరు మధుసూదన రావు, రేగళ్ల లక్ష్మణరావు, అలుగుండ్ల సుబ్బారెడ్డి, వేవిన నాగరాజు,మంగళపురి మహేష్ , గాయత్రి ,విజయకుమారి, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

# పరిష్కారం




పరిస్థితులు దుర్భరము
ప్రతి దానికి పరిష్కారము
తప్పకుండా ఉంటుంది
ఒక్కక్షణం యోచిస్తే
ప్రత్యక్షం అవుతుంది
మేధస్సుకు పదునుపెట్టు
పరిష్కారం చూపెట్టు
నిబ్బరమైన మనసుతో
ఏదైనా చేసిపెట్టు
జాగ్రత్త లేకుంటే
బ్రతుకులు అతలాకుతలము
పరిష్కారం దిశలోన
సాగిపోతే విజయము
సమస్యకు దొరుకుతుంది
వెతికితే పరిష్కారము
వహిస్తే నిర్లక్ష్యము

**గద్వాల సోమన్న,**
9966414580

# సెల్ఫ్ డిఫెన్స్ పై మరియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ల పై విధ్యార్ధినీ విధ్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం బృంధాలు.

**మహిళలకు "శక్తి" యాప్ ఆవశ్యకత గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న శక్తి టీం బృందాలు...**





**విజయవాడ పశ్చిమ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహిళలు, బాలికల యొక్క రక్షణ కొరకు కల్పించబడుతున్న మహిళా చట్టాలను గురించి మహిళలకు, విధ్యార్ధినీ విధ్యార్ధులకు శక్తి యాప్, 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ మోసాల నివేదికల కోసం), 1098 (బాలల హెల్ప్‌లైన్), 181 (మహిళల హెల్ప్‌లైన్), 1073 (ట్రాఫిక్ సమాచారం కోసం), 101 (ఫైర్ ఎమర్జెన్సీ) వంటి కీలకమైన టోల్-ఫ్రీ నెంబర్ లపై నగర పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించడం జరుపుతున్నారు. ద్వారా ఆపద సమయాలలో ప్రజలకు మేము ఉన్నాం అనే భరోసా కల్పించాలనే సదుద్దేశంతో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్, మహిళా పోలీసు స్టేషన్ ఎ.సి.పి. టి.దైవ ప్రసాద్ పర్యవేక్షణలో ఎన్.టి.ఆర్. పోలీసు కమిషనరేట్ పరిదిలోని శక్తి టీం బృంధాలు నగరంలోని వివిధ ప్రదేశాలలో మహిళలకు మరియు బాలికలకు వారి రక్షణకు కల్పించబడిన మహిళా చట్టాల గురించి శక్తి యాప్ వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించడం జరుగుతుంది. నేపధ్యంలో సోమవారం శక్తి టీం బృంధాలు నగరంలోని వివిద ప్రదేశాలలోని మహిళలకు, యువతులతో మాట్లాడి శక్తి యాప్ అనేది అక్రమార్కుల పాలిట ఆయుధంగా మారుతుందని, మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలకు యువతులకు శక్తి యాప్ వలన ఉపయోగాలను తెలియజేసి వారి ఫోన్ లలో శక్తి యాప్ లను డౌన్ లోడ్ చేయించారు.అదేవిధంగా శక్తి టీం బృంధాలు పటమట నిడమానూరు హై స్కూల్, ఎస్.ఆర్.కె. కళాశాల, స్టెల్లా కళాశాల మరియు నందిగామ మగాళ్లు జెడ్.పి.హై స్కూల్ లలోని విధ్యార్ధినీ విద్యార్ధులతో సమావేశాలు నిర్వహించి వారికి ఆపద సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ( సెల్ఫ్ డిఫెన్స్) గురించి, సోషల్ మీడియా మరియు సైబర్ ద్వారా జరిగే నేరాల గురించి, చిన్నపిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాల గురించి మరియు నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పొక్సో యాక్ట్ గురించి, డైయల్ 112 , మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం మొదలగు అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**ఇబ్రహీంపట్నం, జూలై 28 (వార్తా ప్రభ ప్రతినిధి):** విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం గాజులపేట వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నం శక్తి నగర్ కు చెందిన సందీప్ (38) ద్విచక్ర వాహనంపై పశ్చిమ ఇబ్రహీంపట్నం వైపు వెళ్తుండగా వెనుక నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమే : యార్లగడ్డ



**హనుమాన్ జంక్షన్,జూలై28(వార్త్రాప్రభ)** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుని వారి నుండి అర్జీలు స్వీకరించిన ఆయన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఇతోదికంగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బు జమ చేసిన సంగతి గుర్తు చేశారు. బుడమేరు వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారం విడుదల చేసి రైతులను ఆదుకున్నామన్నారు. ఏడాది ముందుగానే సాగునీటిని విడుదల చేసినట్లు చెప్పారు. రైతులకు ఇచ్చే వ్యవసాయ రుణాలను పెంచినట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో రసాయన ఎరువుల కొరత నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే రెండేళ్లలో గన్నవరం నియోజకవర్గ ముఖచిత్రం మారనుందని జోశ్యం చెప్పారు. గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలుపుతానని ప్రజలందరూ తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపాలకృష్ణ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయ్యాల రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్ రాష్ట్ర తెలుగు రైతు నాయకులు గుండపనేని వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపల్లి వెంకన్న మాజీ సర్పంచ్ ఆర్నెపల్లి సూరిబాబు గ్రామ సర్పంచ్ ఆర్నెపల్లి రవివర్మ, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గండిపూడి నితీష్ కుమార్, చలసాని శ్రీను, డీసీ చైర్మన్ కొమ్మరెడ్డి రాజేష్, మొవ్వ వెంకటేశ్వరరావు, బొమ్ములూరు ,దంటగుంట్ల సర్పంచులు కాటూరి విజయభాస్కర్, యజ్జవరపు రంగారావు, చిన్నారి చిన్నా, సింగవరపు చంద్రమౌళి, ప్రసాద్ పాల్ కర్ర, మోవ్వ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు...

## ఆగిరిపల్లి మండలము లో యూరియా కొరత లేదు .......వ్యవసాయ అధికారిణి



**ఆగిరిపల్లి, జూలై 28(వార్తా ప్రభ):** ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలము లో యూరియా కొరత లేదని రైతు లెవ్వరూ అధైర్య పడొద్దని మండల వ్యవసాయ అధికారిని జె . భార్గవి పత్రికా ప్రకటన లో తెలియచేసారు. వారి నాట్లు సమయము లో ఎటువంటి యూరియా కొరత లేదని తెలియచేసారు. ఆగిరిపల్లి మండలము లో రిటైల్ డీలర్ల వద్ద 36. 850 మెట్రిక్ టన్నులు, సొసైటీ ల వద్ద 38.620 మెట్రిక్ టన్నుల యూరియా, మొత్తం 74. 805 టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి తెలియచేసారు. ఎప్పటికప్పుడు యూరియా అయిపోగానే రిటైల్ డీలర్ల వద్ద మరియు సొసైటీ ల వద్ద యూరియాను రైతులకు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయాధికారి రైతులకు తెలియచేసారు.

## పర్యాటకులు ఫుల్....!! భద్రత నిల్....!!

**● కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురవుతున్న పవిత్ర సంగమం ● ఆకతాయిలకు, మైనర్ల ద్విచక్ర వాహన విన్యాసాలకు వేదిక ● పోలీస్ పర్యవేక్షణ కరువు**





**ఇబ్రహీంపట్నం, జూలై 28(వార్తా ప్రభ ప్రతినిధి):**దేశంలోని మొట్టమొదటిసారిగా నదుల అనుసంధానంతో చరిత్ర పుటల్లోకి ఎక్కిన పవిత్ర సంగమం కూటమి ప్రభుత్వంలోనే నిర్లక్ష్యానికి గురవుతుంది. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యానికి చేసిందని తీవ్రస్థాయిలో నాటి ప్రత్యక్ష హోదాలో విమర్శించిన.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా పవిత్ర సంఘంపై దృష్టి పెట్టకపోవడం తీవ్రశోచనీయం.నాటి ప్రభుత్వం తీసుకెళ్లిన హారతి నేటికీ తిరిగి రాలేదు. స్థానికంగా పర్యాటకులు సేద తీరుదామని వస్తే భద్రత లేక బిక్కుబిక్కుమంటున్నారు.ప్రస్తుతం సంగమం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా, మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలు నేర్చుకుంటూ విన్యాసాలు చేసే వేదికగా మారింది. కట్టడి చేసేవారు లేకపోవడంతో వారి ఆకృత్యాలకు అడ్డు లేకుండా పోయింది. దీంతో పవిత్ర సంగమానికి వచ్చిన మహిళలు పిల్లలు ఎటు నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొంటుందోనని దిబీక్కుబీక్కుమంటూ తిరుగుతున్నారు. సౌకర్యాలు కల్పిస్తాం సంఘమానికి పూర్వ వైభవం తెస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు ఇప్పుడు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీన్నిబట్టి ప్రతిపక్షంలో ఆరోపణలు చేయడం సులభం అధికార పక్షంలో ఆచరణ చేయడం కష్టమని భావించాలేమో...?

## ప్రమాదకరంలో ప్రజల ఆరోగ్యం

**ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో తీవ్ర పరిణామాలు**

**- ప్రజారోగ్య వేదిక బృందం పరిశీలనలో తేలిన వాస్తవాలు**



**ఇబ్రహీంపట్నం, జూలై 28(వార్తా ప్రభ ప్రతినిధి):** ఎన్టీటీపీఎస్ పరిసర గ్రామాలు బూడిదతో నిండిపోయి తీవ్రమైన కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజారోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ ప్రకాష్ అన్నారు. మండల పరిధిలోని కిలేశపురం, జూపూడి, ఫెర్రీ ప్రాంతాల్లో ప్రజారోగ్య వేదిక బృందం సోమవారం పర్యటించింది. స్థానికంగా ప్రజలు, విద్యార్థులు, పిల్లలు, యువతను కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ కాలుష్యం వల్ల ప్రజలు చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నట్లు చెప్పారు. ఎన్టీటీపీఎస్ ఫ్లై యాష్ తో పాటు బూడిద చెరువులో లోడింగ్ వల్ల గాలి కాలుష్యం ఏర్పడి చుట్టుపక్కల సుమారు 15 గ్రామాలకు తీవ్ర సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో ఎన్టీటీపీఎస్ యాజమాన్యం గ్రీనరీ పెంచే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. అలాగే ఈ ప్రాంతంలో తాగునీరు కూడా కలుషితం అవుతుందన్నారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి పరిసర గ్రామాల్లో ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం రక్షిత నీరు సరఫరా చేయాలని, కాలుష్య నివారణకు విరివిగా మొక్కలు నాటి గ్రీనరీ ఏర్పాటు చేయాలని, ఈ కార్యచరణను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రెగ్యులర్ గా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అన్ని సౌకర్యాలతో హాస్పిటల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రజారోగ్య వేదిక పూర్తి అధ్యయనం చేసి నివేదికను ఎన్టీటీపీఎస్ యాజమాన్యానికి, ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.కామేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం. సీతారామారావు, కొండపల్లి మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వరరావు, పి.కామేశ్వరరావు, శ్రీధర్, ప్రజారోగ్య వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆ మహనీయుల స్ఫూర్తి అందరికీ ఆదర్శం- మల్లాది విష్ణు



**విజయవాడ, జూలై 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ:గోదావరి, కృష్ణా డెల్టాల రూపకర్త సర్ ఆర్థర్ కాటన్ రైతులపాలిట అపర భగీరథుడని, కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని మాజీ శాసనసభ్యులు, ఏపీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ సెంట్రల్ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మల్లాది విష్ణు ఆ మహనీయులను కొనియాడారు. సర్ ఆర్థర్ కాటన్ 126వ వర్ధంతి నీ, గుర్రం జాషువా 130వ వర్ధంతినీ పురస్కరించుకొని గురువారం ఆంధ్రప్రభ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయంలో ఆ మహనీయుల చిత్రపటాలకు విష్ణు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుల ఖ్యాతిని ఆయన కొనియాడారు.నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సంఘ సంస్కరణే లక్ష్యంగా ఆ మహనీయుడు సృష్టించిన సాహిత్యం ఎప్పటికీ తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోదుంటే అతిశయోక్తి కాదన్నారు.తెలుగు సాహితీ లోకంలో ఆయన దిగ్గజ వ్యక్తిగా నిలిచిపోతారన్నారు. తన అపారమైన జ్ఞానంతో మరియు కుల ఆధారిత వివక్ష కారణంగా అతను ఎదుర్కొన్న పోరాటం ద్వారా, జాషువా తన కవిత్వాన్ని విశ్వవ్యాప్త విధానంతో రాసుకొచ్చారన్నారు.సర్ ఆర్థర్ కాటన్ గురించి ఆయన మాట్లాడుతూ.....1852లో కాటన్ ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్టను నిర్మించి ఆ ప్రాంత ప్రజల హృదయాల్లో అపర భగీరదుడుగా మిక్కిలి ఘనకీర్తిని సంపాదించుకున్నారని, దేశ చరిత్రలో తొలిసారిగా కృష్ణా, గోదావరి డెల్టాల వ్యవస్థను కాలువల ద్వారా ఆయకట్టు, డ్రైనేజి పద్ధతిలో నిర్మించి మార్గదర్శకులైనారని అన్నారు. 1840 లోనే కృష్ణానదిపై ఆనకట్ట ప్రతిపాదనలను బ్రిటీష్ ప్రభుత్వానికి పంపించి సిఫారసు చేయటమే కాకుండా ధవళేశ్వరం బ్యారేజ్ పూర్తయిన తరువాత కృష్ణానదిపై ఆనకట్టను నిర్మించారన్నారు. అందుకే గోదావరి కృష్ణా డెల్టా ప్రాంత ప్రజలు దేవాలయాలకు వెళ్ళినపుడు మొదటిగా అన్నం పెట్టినవాడే దేవుడిగా భావించి కాటన్ మహాశయుని స్మరించుకోవటం జరుగుతుందన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తితో వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. రైతులకు అన్ని విధాల భరోసా కల్పించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని ఆరు కొనియాడారు.రైతులను ఆదుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగన్ ప్రభుత్వమేనన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఎప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, యర్లగొర్ల శ్రీరాములు, ఈసరపు రాజ రమేష్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట అధ్యక్ష్యులు రవి చంద్ర, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ రాణి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఆచారి, జిల్లా కార్యదర్శి రమణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్యాం, కల్చురల్ విభాగం అధ్యక్ష్యులు పేరూరి ప్రేమ, సెంట్రల్ నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలు తోపుల వరలక్ష్మి, పంచాయతి విభాగం అధ్యక్ష్యులు బందరు ఆంజనేయులు, సోషల్ మీడియా అధ్యక్ష్యులు మీసాల సత్యనారాయణ, కాళ్ళ ఆది నారాయణ, కృష్ణ యాదవ్, మన్యం జగదేశ్ పలు విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## మీకోసం లో అధికారులకు గులాబీ పుష్పాలతో పాటు అర్జీ ఇచ్చిన చిన్నారులు.



**మచిలీపట్నం జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యల పరిష్కారం కోసం సచివాలయాలలో తమ సమస్యలను పరిష్కరించాలనీ ఎన్నిసార్లు కోరినా ఫలితం కలగలేదని ఇక గత్యంత లేని పరిస్థితులలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీకోసం లో పరిష్కారం కోసం వచ్చిన బాధితుడు తన భార్య ఇద్దరు పిల్లలతో మచిలీపట్నం వచ్చి మీకోసం లో అర్జీతోపాటు రెండు గులాబీ పుష్పాలు అధికారులకు చిన్నారులు అందజేశారు.

## వక్ఫ్ ఆస్తులను ముస్లింల సంక్షేమానికి ఉపయోగించండి

**మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు అల్తాఫ్ బాబా వినతి**



**ఇబ్రహీంపట్నం, జూలై 28(వార్తా ప్రభ ప్రతినిధి):**మైలవరం నియోజకవర్గ పరిధిలో ఎన్నో వక్ఫ్ భూములు ఆక్రమణదారుల చేతిలో ఉన్నాయని వాటిని విడిపించి ముస్లింల సంక్షేమానికి ఉపయోగించాలని నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు విజ్ఞప్తి చేశారు హజ్రత్ సయ్యద్ షాబుఖారి ఆస్థాన పీఠాధిపతులు అల్తాఫ్ బాబా. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ను సోమవారం నాడు గొల్లపూడి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ముస్లిం పిల్లలు విద్య అభ్యసించి సరైన ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, వక్ఫ్ భూములలో వారికి ఉపయోగకరమైన స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు, విద్యాసంస్థలు, ఉపాధి కల్పించే సంస్థలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కలిసి ఇదే విషయంపై చర్చించామని ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. తప్పకుండా అభివృద్ధికి సహకరించిన ముస్లిం సమాజానికి అండగా ఉంటానని, వారికి అన్ని విధాల ఉపయోగమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తారని హామీ ఇచ్చారు వసంత కృష్ణ ప్రసాద్. టిడిపి నాయకులు బొమ్మసాని సుబ్బారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాష్ట్ర మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో సుప్రీత మరియు సర్వాణి రజత మరియు కాంస్య పతకాలు గెలుచుకున్నారు

**విజయవాడ పశ్చిమ జూలై 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జూలై 27 నుండి 28 వరకు భీమవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులైన మహిళా ఎఫ్ ఐ డి ఈ మాస్టర్స్ పొట్లూరి సుప్రీత మరియు సర్వాణి చీదెల్ల వరుసగా రజత మరియు కాంస్య పతకాలను సాధించారు.టోర్నమెంట్ అంతటా అద్భుతమైన వ్యూహాత్మక నైపుణ్యం మరియు స్థిరత్వాన్ని ప్రదర్శించి, ఇద్దరు క్రీడాకారిణులు 7కి 6 పాయింట్లు సాధించారు. ఈ విజయంతో, వారు రాబోయే జాతీయ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించడానికి అర్హత సాధించారు.వారి విజయాన్ని గౌరవించేందుకు, సోమవారం కానూరులోని శ్రీ కృష్ణ రుద్ర మెడికల్ అకాడమీలో ఒక సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో, వాసవి జాగృతి గవర్నర్ అలుమూరి అమరాంత్, శ్రీ కృష్ణ రుద్ర మెడికల్ అకాడమీ డైరెక్టర్ మోదుకూరి కృష్ణ ప్రసాద్, వాసవి జాగృతి క్యాబినెట్ కార్యదర్శి అప్పన సాయిబాబు, జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనడానికి మద్దతుగా సుప్రీత మరియు సర్వాణిలకు ఒక్కొక్కరికి రూ.6,400 అందజేశారు.ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ కార్యదర్శి ఎన్. సుజాత, విద్యార్థుల విజయాల పట్ల గర్వంగా వ్యక్తం చేశారు మరియు చెస్‌లో వర్ధమాన ప్రతిభను ప్రోత్సహించినందుకు మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్యసాయం కోసం రూ.41 వేలు వితరణ

**విజయవాడ పశ్చిమ, జులై 28:(వార్తా ప్రభ ప్రతినిధి)**సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కెబిఎన్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో పేద బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 41 వేలు అందజేసారు. జి.కొండూరు మండలం, వెలగలేరు గ్రామానికి చెందిన 11 సంవత్సరాల బాలుడు ఎస్.హేమంత్ వీరేంద్ర బ్రెయిన్ ట్యూమర్, బోన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికం కారణంగా వైద్యఖర్చుల కోసం ఇబ్బందిపడుతున్న హేమంత్ తల్లిదండ్రులు జోజిబాబు, జ్యోతి కె.బి.ఎన్. కళాశాలను ఆశ్రయించగా, ఎన్.ఎస్.ఎస్. విభాగం పక్షాన అతడికి ఆర్థిక సహాయం అందించారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఫైన్ కాలేజీ ప్రిన్సిపాల్ టి.నరేంద్ర, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.సాంబశివరావు, శాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.



## పెన్షనర్ల సమస్యలు సత్వరమే పరిష్కారించాలి - కృష్ణాజిల్లా అధ్యక్షుడు రామస్వామి

● పెన్షనర్ల సంఘం గుడివాడ నూతన అధ్యక్షునిగా శంకరనాథ్ భవిరి ఎన్నిక..



**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గుడివాడ సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం ఎన్జీవో భవనము నందు సంఘ అధ్యక్షులు భవిరి శంకర్ నాథ్ అధ్యక్షతన జరగగా.. కార్యక్రమానికి అతిధులుగా జిల్లా పెన్షనర్స్ అధ్యక్షులు జి రామస్వామి, ప్రధాన కార్యదర్శి అంబటి వరప్రసాద్, ఖజానా అధికారి జ్యోతిశ్వరరావు, గౌరవాధ్యక్షులు పెద్దిరెడ్డి సీతారామయ్య లు తదితరులు హాజరై, పెన్షనర్ల సమస్యలపై ప్రసంగిచారు. జిల్లా అధ్యక్షులు రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం డి ఆర్ బకాయలుగా వెంటనే విడుదల చేయాలని, అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ గత విధానాన్ని కొనసాగించాలని కోరారు. శంకర్ నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర భీమా విధానాన్ని ప్రవేశపెట్టి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ విధానం అమల్లోకి రావాలనిచేయాలని, సీనియర్ సిటిజన్స్ కి రైలు మరియు విమాన ప్రయాణాలలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఖజానాధికారి జ్యోతి స్వరరావు మాట్లాడుతూ పెన్షనర్లు సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక జరగగా శంకర్ నాథ్ భవిరి అధ్యక్షులుగా, వివి మురళీకృష్ణ ప్రధాన కార్యదర్శిగా, కొమరవోలు రామకృష్ణ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా పెద్దిరెడ్డి సీతారామయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా బొమ్మదేవర సత్యనారాయణ, మహిళా కార్యదర్శిగా పొట్లూరు రమాదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గుల్లపల్లి ప్రభాకర్ రావు తదితరులు ఎన్నికయ్యారు.

## సమాజ సేవే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యం



**కలిదిండి,జూలై 28 (వార్తాప్రభ) :** కలిదిండి మార్కెట్ యార్డు నందు కలిదిండి మానవత నెలవారీ మీటింగ్ అధ్యక్షులు నూకల శ్యామలరావు గుప్తా అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశమునకు ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు కొండేటి సత్యనారాయణ, కైకలూరు మానవతా అధ్యక్షులు గుర్రం శ్యాము లు ముఖ్య అతిథులుగా హాజరై, ఈ సంవత్సరం సభ్యత్వములపై సమీక్ష నిర్వహించినారు. ఈ నెల సేవా కార్యక్రమంలో భాగంగా కలిదిండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.డి.యూసిన్ 1000 మార్కులు గాను 995 మార్కులు వచ్చిన సందర్భంగా, కలిదిండి మానవత వారు రూ.10,000/- లు (పదివేల రూపాయలు) పారితోషకం గా అందచేశారు. పేదవారికి వివిధ సందర్భాల్లో మానవత తన వంతు సహాయం చేయుటకు ముందు ఉంటుందని ఈ సందర్భంగా వక్తలు తెలిపినారు. అలాగే కలిదిండి మానవత ప్రారంభించి 5 సంవత్సరములు పూర్తి చేసుకొని 6వ సంవత్సరంలోనికి ప్రవేశించిందని తెలియచేసారు. గత ఐదు సంవత్సరాల్లో మార్చురీ బాక్సులు 1520 సార్లు ప్రజలకు సేవలు అందించినదని చైర్మన్ పేటేటి వివేకానంద పేర్కొన్నారు. చివరగా ఈ సమావేశంలో అతిథులను ఘనంగా సత్కరించినారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంయుక్త కార్యదర్శి గోదావరి సత్యనారాయణ, గౌరవ డైరెక్టర్ మారుబోయిన రత్నారావు, జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్ ఊర శ్రీధర్ మరియు కలిదిండి మానవతా శాఖ సభ్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** వెరికోస్ వెయిన్స్ (ఉబ్బిన సిరలు) నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరమని డాక్టర్ లావణ్య పేర్కొన్నారు. స్థానిక జివి పూర్ణ చంద్రరావు ఫంక్షన్ హాల్ లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో ఆమె పై విధంగా అన్నారు. ప్రారంభ దశలో కలర్ డాప్లర్ టెస్ట్ ద్వారా దీన్ని గుర్తించవచ్చునని, తదుపరి చికిత్స ద్వారా తగ్గించవచ్చునని అన్నారు. ఈ మెడికల్ క్యాంపులో 80 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన కొద్ది మందికి కలర్ డాప్లర్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు యలమంచిలి నాగేశ్వరరావు, సెక్రటరీ గుళ్లపల్లి కిరణ్ బాబు, కౌన్సిలర్ గవిర్నేని బాబు శ్రీకర్, పూర్వ అధ్యక్షులు టి ఎన్ రాజశేఖర్, ఫాస్ట్ ప్రెసిడెంట్ ఏ సుబ్రహ్మణ్యేశ్వర రావు, కేబీజీ తిలక్, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, బలుసు శంకర్రావు, ఏజే ప్రసాద్, సాగిరాజు ఉదయ భాస్కరరాజు, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



టిడిపి జిల్లా నాయకుడు ముళ్ళపూడి రమేష్ చౌదరి తండ్రి బాబురావు మృతి చెందారు. ఈ క్రమంలో అయన భౌతిక దేహనికి సోమవారం గుడివాడ, పెడన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్ లు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య లు నివాళ్ళు అర్పిస్తున్న దృశ్యం.. తరువాత ముళ్ళపూడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాబురావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

-గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :

## ఘనంగా శుభావతికి స్వచ్ఛంద సంస్థల సత్కారం





**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** స్థానిక ఎన్.జి.ఓ హెూంలో గుడివాడ ఎన్జీవో తాలూకా యూనిట్ మరియు ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ల ఆధ్వర్యంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు గ్రహీత శుభావతిని పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎఫ్ పి ఎఫ్ కన్వీనర్ డిఅర్బీ ప్రసాద్ సభాధ్యక్షత వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ సెక్రెటరీ భవిరి శంకర్‌నాథ్ ఎన్.జి.జి.ఓ నేతలు షేక్ ఫరీద్ భాషా, జి. రాజేంద్రప్రసాద్, కొండపల్లి చందు, డా విజయ శ్రీ, జి సత్యన్నారాయణ తదితరులు అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీత శుభావతి మాట్లాడుతూ గుడివాడ పట్టణ ప్రజలకు ధవ్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 25 కు పైగా స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.

**వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో.. :** ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి జాతీయస్థాయిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న వలివేటి శుభావతికి ఎన్జీఓ హెూమ్ లో జరిగిన సన్మాన వేడుకల్లో జాగృతి క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్, కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు లు చిరు సత్కారం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుభావతి తన సేవలను చిత్తశుద్ధితో, అంకితభావంతో సుమారు 39 సంవత్సరాల పాటు ప్రజారోగ్య సేవలు అందించారనీ కొనియాడారు.

## వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ సాయి సునీత గుడ్లవల్లేరులో అధికారిక పర్యటన..

-వాసవి క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు..





**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** వాసవి క్లబ్ గుడ్లవల్లేరు నందు జిల్లా గవర్నర్ అన్నం సాయి సునీత అధికారిక పర్యటన లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత విష్ణు వందన డాల్ మిల్ ప్రాంగణం నందు గరుకు స్థంభం ప్రారంభోత్సవం, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రము నకు 5116/- వితరణ (చీదెళ్ల బసవేశ్వర రావు శ్రీమతి లక్ష్మీ), పసుబోట్ల పాలెం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నకు 5116/- వితరణ (చిట్టూరి కామేశ్వరి శ్రీనివాస రావు దంపతులు), పేద జంట కు నూతన వస్త్రాలు బహుకరణ, గవర్నర్ గారికి 8 కేసిజిఎఫ్ లు అందజేయడం.. అలాగే శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం నకు 5116/- వితరణ (యమ్.జి.వి.వి గుప్తా, జయప్రద దంపతులు), ప్రభుత్వ ఆసుపత్రి కి 10 లీటర్ల సోడియం హైపో క్లోరైడ్ ద్రావణం అందజేయడం, గవర్నర్ గారికి 1010 ఫారం అందజేయడం జరిగింది (2026 పిఎస్‌టి ఫారం), గవర్నర్ అన్నం సాయి సునీత కి నిత్యావసర వస్తువులు తో తులా భారం వేసి ఆ వస్తువులు ను పామర్రు శ్రీ వాసవి వృద్ధ శరణాలయంకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కేబినెట్ ట్రెజరర్ సముద్రాల సూర్య ప్రకాశ రావు, వైస్ గవర్నర్ మాజేటి హరి ప్రసాద్, కందుల సురేష్, రవ్వా పిచ్చయ్య లు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడం లో సహకరించిన దాతలను, విచ్చేసిన అతిథులను సన్మానించి సత్కరించారు. పై కార్యక్రమాలల్లో అధ్యక్షులు ఎం.జి.వి.వి గుప్తా, కార్యదర్శి కొత్త వెంకట కుటుంబ రావు, కోశాధికారి బి. వి. శ్రీనివాస రావు లు ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సహచరుడిగా ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే రాము

● టిడిపి కార్యాలయంలో ప్రజల నుండి సమస్యలు అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే.. తక్షణ చర్యలు తీసుకొని.. పలువురి సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే రాము..



**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** నాయకుడులా కాక సహచరుడిగా ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజా వేదికలో సోమవారం ఉదయం ప్రజల నుండి ఎమ్మెల్యే రాము సమస్యల అర్జీలను స్వీకరించారు. గుడివాడ నియోజకవర్గ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు తమ సమస్యల అర్జీలను ఎమ్మెల్యే రాముకు తెలియజేశారు. తనను కలిసిన ప్రజల సమస్యలను సావధానంగా ఎమ్మెల్యే రాము.. సంబంధిత శాఖల అధికారులకు ఫోన్లు చేసి పలు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. పలు ప్రాంతాలకు చెందిన పలువురు రేషన్ కార్డు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందుతుందని, రేషన్ కార్డు దరఖాస్తు నిరంతర ప్రక్రియని ప్రజలందరూ ఆందోళన చెందనవసరం లేదని లేదని భరోసా సంబంధిత సచివాలయ శాఖ కార్యదర్శి తో ఫోన్లో మాట్లాడారు. గుడివాడలో డ్రైనేజీ సమస్యలపై పలు వార్డులకు చెందిన వారు ఎమ్మెల్యే రాముకు వినతి పత్రం అందచేశారు. మున్సిపల్ అధికారులకు ఫోన్లు చేసిన ఎమ్మెల్యే రాము డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కులమత వర్గ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. సమస్యలపై అన్నివేళలా ప్రజలు ప్రజా వేదిక కార్యాలయానికి రావచ్చన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాయకుడుగా సేవకుడుగా కాక సహచరుడుగా ఉంటూనే ప్రజల సమస్యల పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు. ప్రజా శ్రేయస్సే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే రామును కలిసిన వారిలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటుగా, పలువురు కూటమి నాయకులు కూడా ఉన్నారు.

## కానిస్టేబుల్ పై హత్య ప్రయత్నం



**తిరువూరు,జూలై 28 (వార్తాప్రభ) :** ఏ.కొండూరు పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ కాంతారావు పై హత్యాయత్నం ప్రయత్నం తనపై మేకల రవి అతని అనుచరులు రాడ్డుతో హత్యాయత్నం చేయబోయారని తృటిలో తప్పించుకున్నానని మీడియాతో తెలిపిన కానిస్టేబుల్ కాంతారావు ఈరోజు ఉదయం వాళ్ళ దాడిలో బొటనవేలుకు,కడుపులో దెబ్బలు తగిలి తిరువూరు ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నానని కానిస్టేబుల్ కాంతారావు తనని హత్యచేసేందుకు ఈరోజు రాడ్డుతో దాడి చేశారని మీడియాకు తెలిపిన కానిస్టేబుల్ కాంతారావు.

## మర్యాదపూర్వక కలయిక



**తిరువూరు,జూలై 28 (వార్తాప్రభ) :** తెనాలి టూ టౌన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తన స్నేహితుడు దుర్గాప్రసాద్ మర్యాదపూర్వంగా తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన తిరువూరు మండల విద్యుత్ శాఖ ప్రవేట్ కాంట్రాక్టర్ మిరియాల దినేష్

## వైభవంగా శ్రీ గోదా దేవి తిరునక్షత్ర వేడుకలు..



**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** పట్టణంలో ప్రసిద్ధిగాంచిన జగన్నాధపురం లోని శ్రీ భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ గోదాదేవి అమ్మవారి తిరునక్షత్ర వేడుకలు సోమవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణరావు మరియు ధార్మిక సంస్థల సహకారంతో జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా రైల్వే స్టేషన్ రోడ్డులోని మాజీ చైర్మన్ ఇందిరారమణ రావు స్వగృహం వద్దనుండి అమ్మవారికి సమర్పించనున్న శ్రీ వల్లి పుత్తూరు నుండి తీసుకువచ్చిన తిరుమంజన పూజా సామాగ్రి, మరియు శ్రావణపట్టి సారెను మేళ తాళాల మధ్య ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. శ్రీ గోదాదేవి ఉత్సవ మూర్తికి వేద పండితులు విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాల అనంతరం శ్రావణపట్టి సారెను అమ్మవారికి సమర్పించారు. ఎంతో వైభవంగా అమ్మవారి తిరునక్షత్ర వేడుకలు జరగడానికి సహకరించిన భక్తులకు చలసాని ఇందిర రమణరావు ధన్యవాదాలు తెలిపారు. లోక కళ్యాణార్ధమే భక్తుల సహకారంతో నేడు అమ్మవారి తిరు నక్షత్ర వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు దేవస్థాన కందుల గోపాలరావు తెలియచేశారు. ఈ వేడుకల్లో వేద పండితులు వేదాంతం అప్పలాచారి, భక్తులు లింగం చిట్టిబాబు, ధార్మిక సంస్థల ప్రతినిధులు చిన్ని, రమణమ్మ, కుమారి, ఆండాల్ గోష్ఠి, గోదా గోష్ఠి సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ స్టేడియం షాప్స్ అద్దెదారుల కమిటీ ఎన్నిక



**గుడివాడ,జూలై 28 (వార్తాప్రభ) :** స్థానిక ఎన్టీఆర్ స్టేడియం చుట్టు పక్కల గలిగిన వాణిజ్య షాప్స్ అద్దెదారుల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా జవ్వాజి గంగరాజు, అధ్యక్షుడిగా పాలెపు నందకిషోర్, కార్యదర్శిగా ఆచంట వెంకటరత్నంతో పాటుగా ఇతర కమిటీ సభ్యులను దుకాణదారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణస్వీకార అనంతరం నూతన కమిటీ సభ్యులను స్టేడియం దుకాణదారులు సత్కరించారు. స్టేడియం కమిటీను సమన్వయం చేసుకుంటూ దుకాణదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నందు కిషోర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులుగా శేగు సత్యనారాయణ, కూరళ్ళ రాజేష్ మాధవ్, సంయుక్త కార్యదర్శిగా దూరడ్ల శివకృష్ణ, కోశాధికారిగా ఆత్మకూరి శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రమణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కొత్త మురళీకృష్ణ, కొత్త మురళి పొట్లూరి కృష్ణ రావు, దర్శి సత్యనారాయణ, సనకా సుబ్బారావు, గాదిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాల శిబిరంపై పోలీసులు దాడి

● 15 మంది పందెపు రాయుళ్లు అరెస్ట్ ● 24 ద్విచక్ర వాహనాలు సీజ్ ● రూ.20,500 ల నగదు, ఒక కోడి పుంజు ను స్వాధీనం చేసుకున్న పోలీసులు



**జి.కొండూరు,జూలై 28 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలం పరిధిలోని కుంటముక్కల గ్రామ శివారు లో నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై స్థానిక ఎస్ఐ సతీష్ కుమార్ సిబ్బందితో సోమవారం కలిసి దాడి చేశారు.ఈ దాడిలో 15 మంది పందెపు రాయుళ్లు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే 24 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని, రూ.20,500 ల నగదు, ఒక కోడి పుంజు ను కూడా స్వాధీనం చేసుకున్నామని, మరి కొంతమంది పందెపురాయుళ్లు పారిపోయినట్లు తెలియజేశారు.మండల పరిధిలో ఎక్కడైనా జూదం, కోడిపందాల శిభిరాలు నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సతీష్ కుమార్ హెచ్చరించారు.

# కృత్రిమ కొరత సృష్టిస్తే ఖబడ్దార్..

● రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు ● దుకాణాల లైసెన్సుల రద్దుకూ వెనుకాడం ● జిల్లాలో సమృద్ధిగా ఎరువులు, పురుగుమందులు ● అందుబాటులో 30,332 మెట్రిక్ టన్నుల ఎరువులు ● నానో యూరియాను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం ● ప్రకృతి సేద్యం దిశగా అన్నదాతలను మళ్లిస్తున్నాం ● పెట్టుబడిని తగ్గించి ఆదాయ వృద్ధికి కృషిచేస్తున్నాం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**కంచికచర్ల,జూలై 28 (వార్తాప్రభ) :** జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నవేళ సమృద్ధిగా ఎరువులు, పురుగు మందులు ఉన్నాయని.. ప్రస్తుతం 9,976 మెట్రిక్ టన్నుల యూరియా, 2,457 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,157 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 14,197 మెట్రిక్ టన్నుల ఎన్‌పీకే ఇలా మొత్తం దాదాపు 30,332 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎరువులు, పురుగుమందులకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించి, అన్నదాతలను గందరగోళానికి గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని, దుకాణాల లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ కంచికచర్లలో శ్రీ కనకదుర్గ ఎరువులు, పురుగుమందుల దుకాణం, గోదాముతో పాటు మన గ్రోమోర్ ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఫిజికల్ స్టాటస్‌ను ఆన్‌లైన్ రికార్డులతో సరిపోల్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల సరఫరాపై అప్రమత్తంగా ఉన్నామని, క్షేత్రస్థాయిలో ఆర్‌డీవోలు, తహసీల్దార్లు తనిఖీలు చేస్తున్నారని పేర్కొన్నారు. కృత్రిమ కొరతను సృష్టించడం, ఎరువులను అధిక ధరలకు అమ్మడం, అడిగిన ఎరువును కాకుండా వేరే ఎరువును ఇవ్వడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని, ఒకవేళ రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఎరువులు, పురుగు మందులపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

**విచ్చలవిడి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం:** రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి సాగు విధానాలు దిశగా వారిని మళ్లిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్ఎఫ్) వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక రాబడులు, ఆదాయాలు వస్తాయన్నారు. ఇష్టమొచ్చినట్లు రసాయన ఎరువులు ఉపయోగిస్తే భూ సారం క్షీణిస్తుందని, పర్యావరణానికీ ముప్పు ఏర్పడుతుందని ఈ నేపథ్యంలో రసాయన ఎరువుల వినియోగాన్ని 15-20 శాతం వరకు తగ్గించేందుకు, పీఎం ప్రణమ్ పథక లక్ష్యాలను చేరుకునేందుకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. నానో యూరియా వల్ల ఎరువు సామర్థ్యంతో పాటు సగానికి సగం ఆదా జరుగుతుందని, అందుకే ఈ నానో యూరియా వినియోగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అగ్రీ టెక్‌ను, అధికా ఆదాయాలు వచ్చే ఉద్యాన పంటలను కూడా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, అగ్రి ఏడీ శ్రీనివాస్, ఏవో విజయ్ కుమార్, తహసీల్దార్ నరసింహారావు తదితరులు ఉన్నారు.

